నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ మంగళవారం 29 ఏప్రిల్ 2025 | ADILABAD NIRMAL



భోరజ్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కామాయి గ్రామస్తులు

# ఇందిరమ్మ ఇండ్ల కోసం..

### భోరజ్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట కామాయి గ్రామస్తుల ధర్నా

జైనథ్, ఏప్రిల్ 28 : భోరజ్ మండల పరిధిలోని కామాయి గ్రామంలోని అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని సోమవారం భోరజ్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా యువ నాయకులు పాయల శరత్ మాట్లాడుతూ.. కామాయి ఇందిరమ్మ గ్రామ కమిటీ, గ్రామ ఎన్ఆర్ ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ పోయం సుభాష్ కుమ్మక్కై గ్రామంలో 11 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించారని అన్నారు. 11 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల్లో ఏడుగురికి భూములు ఉన్నాయని అన్నారు. కామాయి గ్రామంలో భూముల ఇండ్లు లేనివారికి 50 మందికి పైగా లబ్ధిదారులు ఉన్నారని, 2006లో పెన్‌గంగా వరదల వల్ల ఇండ్లు నష్టపోయిన బాధితులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని ఎంపీడీవో సి.వేణుకు వినతి పత్రం అందజేశారు. లేని పక్షంలో జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.




ఆదివారం వరంగల్‌లో నిర్వహించిన సభకు తరలివచ్చిన జనసందోహం

వరంగల్‌లో నిర్వహించిన సభలో అభివాదం చేస్తున్న కేసీఆర్

# రజతోత్సవ జోష్

# జనాన్ని చూసి కాంగ్రెస్‌కు మతిభ్రమించింది

ఎదులాపురం, ఏప్రిల్ 28 : బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవం సందర్భంగా వరంగల్‌లో నిర్వహించిన సభకు భారీగా జనం తరలిరావడం కాంగ్రెస్ పార్టీ నేతలకు మతిభ్రమించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. సభకు వచ్చిన ఆదరణను చూసి ఓర్వలేకనే కేసీఆర్‌పై మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రామన్న మీడియాతో మాట్లాడారు. మంత్రులు సీతక్కకు బుద్ధిలేదని, పొంగులేటికి పొగరెందుకు అని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలను విస్మరించిందని, ఈ అంశాన్ని రజతోత్సవ సభలో ప్రస్తావిస్తే కాంగ్రెస్ నేతలకు మింగుడు పడడం లేదన్నారు. కాంగ్రెస్ నేతలకు పరిపాలించే సత్తాలేదని, అలాంటి వారు కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ తప్పిదాలపై ప్రశ్నిస్తే.. ప్రతిపక్షం గొంతు నొక్కేందుకు కేసుల పేరిట ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతున్నదని మండిపడ్డారు. సభలో మాట్లాడిన కేసీఆర్‌పై మంత్రులు విమర్శలు చేయడం, పదవి కోల్పోయిందనే ఇలా మాట్లాడారని అనడం సిగ్గుచేటు అన్నారు. సభ విజయవంతం కావడంతో పార్టీ శ్రేణులు నూతనోత్సాహం నెలకొందన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పట్టి మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేసి తీరుతారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అలాల్ అజయ్, అష్రాఫ్, బీసీ పట్టణ అధ్యక్షుడు దాసరి రమేశ్, మెట్టు ప్రహ్లాద్, గంద్రత్ రమేశ్, మార్శెట్టి గోవర్ధన్, రాజన్న, సేవ్వా జగదీశ్, సాజిదుద్దీన్, బట్టు సతీష్, వేణు యాదవ్, కొండ గణేశ్, ధమ్మపాల్, దేవన్న, ఆన్సర్, బుట్టి శివ, కుమ్రరాజు, ముఖిమ్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

## వరంగల్ సభ సక్సెస్‌తో కేడర్‌లో కొత్త ఉత్సాహం

● మళ్లీ పూర్వ వైభవం దిశగా అడుగులు ● గ్రామాల్లో విస్తృతంగా చర్చ

మంచిర్యాల ప్రతినిధి/ఆదిలాబాద్/నిర్మల్, ఏప్రిల్ 28(నమస్తే తెలంగాణ) : ఉమ్మడి వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ సక్సెస్ కావడంతో ఆ పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ సభకు నాయకులు, కార్యకర్తలతోపాటు వేలాది మంది తెలంగాణవాదులు, ఉద్యమ సానుభూతిపరులు, కేసీఆర్ కేటీఆర్ అభిమానులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఇతర పార్టీలకు భిన్నంగా వరంగల్ తరలి వెళ్లేందుకు చాలామంది స్వచ్ఛందంగా ముందుకు రావడంపై బీఆర్ఎస్‌పై ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్న సంకేతాలు కనిపించాయి. చాలా మంది పార్టీ కార్యకర్తలు రజతోత్సవ సభలో పాల్గొనేందుకు తమ సొంత వాహనాల్లో వెళ్లి కేసీఆర్‌పై అభిమానాన్ని చాటుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుండి లక్షలాదిగా తరలి వచ్చిన ఈ సభలో పార్టీ జాతీయ అధ్యక్షులు కేసీఆర్ చేసిన ప్రసంగం అందరిని ఎంతగానో ఆకట్టుకున్నది. కేసీఆర్ దిశానిర్దేశంతో పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు నేతలంతా సిద్ధమవుతుతున్నారు. ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో లక్షలాదిగా జనం తరలిరావడంతో అధికార కాంగ్రెస్‌తోపాటు బీజేపీలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ప్రధానంగా ఉమ్మడి జిల్లా నుంచి వేలాది మంది వరంగల్‌కు తరలివెళ్లడాన్ని ఇక్కడి ఆ రెండు పార్టీల నేతలు తట్టుకోలేకపోతున్నారు. ఎంతమంది వెళ్లారనే దానిపై తమ అనుచరులతో ఆరా తీసినట్లు తెలిసింది. రజతోత్సవ సభలో కాంగ్రెస్, బీజేపీలపై కేసీఆర్ చేసిన విమర్శల దాడితో పాటు గత 10 ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను మరోసారి ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ అసలు రంగును బయట పెట్టడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. సభ కనీవినీ ఎరుగని రీతిలో సక్సెస్ కావడం, ప్రజలు టీవీలు, సెల్‌ఫోన్‌లకు అతుక్కుపోయి కేసీఆర్ స్పీచ్‌ను ఆసక్తిగా వినడంపై కాంగ్రెస్, బీజేపీలు సమీక్షించుకుంటున్నట్లు సమాచారం. ఆయా పార్టీల ముఖ్య నాయకులు గ్రామీణ స్థాయిలో సభకు వెళ్లిన వారి వివరాలను ఆరా తీస్తుండడం గమనార్హం. ముఖ్యంగా బీఆర్ఎస్ సభ సక్సెస్ కావడంతో కాంగ్రెస్ పార్టీలో ఆందోళన మొదలైంది. ఇప్పటికే అభిప్రాయ బేధాలు, గ్రూపు తగాదాలు, అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతున్న కాంగ్రెస్, బీజేపీలు బీఆర్ఎస్ సభ సక్సెస్‌ను జీర్ణించుకోలేకపోతున్నాయి

#### ఊపిరి పోసిన కేసీఆర్ ప్రసంగం

ఎల్కతుర్తి బహిరంగ సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దాదాపు గంటకు పైగా ప్రసంగించిన తీరు బీఆర్ఎస్ కేడర్‌లో ఊపునిచ్చింది. ముఖ్యంగా బీఆర్ఎస్ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రాధాన్యతను వివరించడమే కాకుండా, కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై విరుచుకుపడ్డారు. బీజేపీ వైఖరిపైనా ఆయన దుమ్మెత్తి పోశారు. ఈ రెండు పార్టీలపై కేసీఆర్ చేసిన విమర్శలు జనాన్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. కేసీఆర్ మాటలకు బహిరంగ సభ ప్రాంగణం చప్పట్లతో మారుమోగి పోయింది. ఆ బహిరంగ సభ దృశ్యాలను టీవీల్లో చూసిన సాధారణ ప్రజలు కేసీఆర్ ప్రసంగానికి మంత్రముగ్ధులయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# సభా.. ఒక చరిత్ర..

### బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు, ఏప్రిల్ 28 : బీఆర్ఎస్ పార్టీ 25 వసంతాల సందర్భంగా ఎల్కతుర్తి ఎక్స్ రోడ్డు వద్ద నిర్వహించిన భారీ బహిరంగ సభ విజయవంతంగా పూర్తయిందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం సుంకిడి గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభకు భారీ ఎత్తున తరలి వచ్చిన నియోజకవర్గ ప్రజలు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. సభలో జనం కాదు అది ప్రభంజనమన్నారు. 2001లో వచ్చిన తెలంగాణ ఉద్యమ జోష్ మళ్లీ కనిపించిందని అన్నారు. ప్రభుత్వం పోలీసులతో కలిసి ఎన్ని కుట్రలు పన్నినా, ప్రజలను సభకు రానివ్వకుండా అడ్డుకున్నా సభ వంద శాతం విజయవంతం కావడం ఒక చరిత్ర అని అన్నారు. రానున్నది ముమ్మాటికీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ తోట వెంకటేశ్, నాయకులు కేదారేశ్వర్‌రెడ్డి, తిరుమల గౌడ్, మొట్టే కిరణ్, అభిరాం రెడ్డి, రవికాంత్, అబ్దుల్లా, ఆశన్న, యాదవ్, ప్రకాశ్, సురేందర్‌రెడ్డి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

# నామినేటెడ్ పదవులు జిల్లాకు ఇవ్వాలి

### కాంగ్రెస్ సమావేశంలో నాయకుల డిమాండ్

ఆదిలాబాద్, ఏప్రిల్ 28(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లాకు నామినేటెడ్ పదవుల్లో జిల్లాకు న్యాయం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. సోమవారం ఆదిలాబాద్‌లో నిర్వహించిన జిల్లా కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఈ సమావేశానికి టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ హాజరయ్యారు. కాగా.. జిల్లా నాయకులు తమ ఆగ్రహాన్ని వారి ముందు వ్యక్తం చేశారు. నామినేటెడ్ పదవుల్లో అధిష్ఠానం ఆదిలాబాద్ జిల్లాను గుర్తించడం లేదని కాంగ్రెస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పదవుల్లో రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లా నాయకులకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తుందన్నారు. జిల్లా డీసీసీ అధ్యక్షుడితోపాటు ఇతర నామినేటెడ్ పదవులు భర్తీ చేసిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని సూచించారు. రైతుబంధు, రూ.2 లక్షల రుణమాఫీ విషయంలో గ్రామాల్లో రైతుల నుంచి వ్యతిరేకత ఉందని నాయకులు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని వివిధ సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ గణేశ్‌రెడ్డి



బాసరలో ఆటోలతో రథయాత్ర నిర్వహిస్తున్న డ్రైవర్లు

## ఆటో డ్రైవర్ల రథయాత్ర

**బాసర మండల కేంద్రంలో** సోమవారం ఆటోడ్రైవర్లు రథయాత్ర నిర్వహించారు. 'ఆటో.. ఆకలి కేకలు' అనే నినాదంతో మే 27వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే ఆటో కార్మికుల మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం రథయాత్ర చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మీ పథకం ద్వారా ఆటోడ్రైవర్లు ఉపాధి కోల్పోయారని, కొందరు ఆత్మహత్యలు చేసుకున్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. బాసర రైల్వేస్టేషన్ నుంచి ఆలయం మీదుగా బస్టాండ్ వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. - బాసర, ఏప్రిల్ 28



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

# సమస్యలను సత్వరం పరిష్కరించాలి

### కలెక్టర్ నిర్మల్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 28 : ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణిలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. అధిక ఉష్ణోగ్రత కారణంగా జిల్లాలోని మారుమూల ప్రాంతాల ప్రజల సహాయార్థం టెలీఫోన్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రజల నుంచి ఫోన్ ద్వారా అర్జీలు స్వీకరించి సమస్య పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు కిశోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్, అధికారులు పాల్గొన్నారు.

#### దొంగ డీ-1 పట్టాలను రద్దు చేయాలి..

తమ గ్రామంలో దొంగ డీ1 పట్టాలు శేత్‌వార్లను ఇచ్చారని వాటిని రద్దు చేయాలని కోరుతూ సోమవారం నిర్మల్ జిల్లా మామడ మండలంలోని న్యూ లింగంపల్లి గ్రామానికి చెందిన వీడీసీ సభ్యులు, గ్రామస్థులు కలెక్టర్ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వ భూములను పలు సర్వే నంబర్‌లలో గల 212.27 గుంటల భూమిని 2012 సంవత్సరం నుంచి 2025 వరకు అక్రమంగా డీ 1 పట్టాలు ఇచ్చారని పేర్కొన్నారు. నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి అక్రమంగా సాగు చేసుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వారి నుంచి భూములు స్వాధీనం చేసుకోవాలని పేర్కొన్నారు.

#### అక్రమంగా కల్లు డిపో నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

కల్లు గీత వృత్తితో సంబంధం లేకుండా కల్లు డిపో నడుపుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టర్‌కు అమరవేణి నర్సాగౌడ్ ఫిర్యాదు చేశారు. నిర్మల్ గ్రామీణ మండలంలోని వెంకటాపూర్‌లో కల్లుగీత వృత్తితో సంబంధం లేకుండా అక్రమంగా కల్లు డిపోను పెట్టి కల్తీ కల్లు అమ్ముతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రెండు గ్రామాల్లో టీఎఫ్‌టీ లైసెన్సులు పొందిన ఒకే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు.




కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన వీడీసీ, గ్రామస్తులు

# గాలివాన బీభత్సం

ఇచ్చోడ(సిరికొండ), ఏప్రిల్ 28 : ఇచ్చోడ, సిరికొండ మండలాల్లో సోమవారం గాలివాన బీభత్సం సృష్టించింది. మధ్యాహ్నం ఒక్కటేసాని భారీ గాలితోపాటు వర్షం కురిసింది. ఇచ్చోడ మండలంలోని బోరిగాం, గాంధీనగర్, కామగిరి, సిరికొండ మండలంలోని పొన్న, తలమద్రి, సోంపెల్లి గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పొన్న సిడాం లక్ష్మిబాయి ఇల్లు పైకప్పు ఉన్న ఇనుప రేకులు లేచిపోయాయి. ఇచ్చోడ-పొన్నకు వెళ్లే దారిలో చెట్లు రోడ్డుపై వచ్చి బడ్డాయి. దీంతో 108 అంబులెన్స్‌తోపాటు ఇతర వాహనాలు నిలిచిపోయాయి. పొన్న గ్రామస్తులు స్పందించి రోడ్డుకు అడ్డంగా చెట్టును తొలగించారు. ఈ అకాల వర్షంతో జొన్న పంటకు నష్టం కలిగిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



పొన్నలో ఎగిరిపోయిన ఇంటి పైకప్పు రేకులు